సాక్షి జనగామ

శనివారం | 4 | ఫిబ్రవరి | 2023



ఎగిసిపడిన అగ్ని కీలలు

వరంగల్ అండర్‌బ్రిడ్జి పెరుకవాడలోని ఓల్డ్ ఫర్నిచర్ షాపులో అగ్నిప్రమాదం జరిగింది. రూ. 1.37 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లింది.

- 8లో



మహిళా సంఘాల ఆందోళన

అవకతవకలను ప్రశ్నిస్తే అమాయకుడిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమేమిటని మహిళా సంఘాలు ఆందోళనకు దిగాయి.

- 9లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 32^0 / 14^0

ఉదయం వాతావరణం తేమకారణంగా చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఈవీఎంలను తనిఖీ చేసిన కలెక్టర్



జనగామ రూరల్: కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలోని గోదామునందు భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ శివలింగయ్య శుక్రవారం తనిఖీ చేశారు. పోలీస్ భద్రత, సీసీ కెమెరాలు, లైటింగ్, ఇతర రక్షణ సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, ఎన్నికల పర్యవేక్షకులు శ్రీనివాస్, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

రాష్ట్రంలో అవినీతి పాలన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



బచ్చన్నపేట: రాష్ట్రంలో నడుస్తున్న అవినీతి పాలనను అంతం చేయాలి.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయని సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి గ్రామాల పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులతో సద్ది సోమిరెడ్డి అధ్యక్షతన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10 నుంచి 25 వరకు అన్ని గ్రామాల్లో శక్తి కేంద్ర స్థాయి సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, కేవీఎల్ఎన్.రెడ్డి, బళ్ల శ్రీనివాస్, బనుక శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



జనగామ రూరల్: కరోనా లాంటి కొత్త వ్యాధులు ప్రబలుతున్నాయి.. ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ మధుమోహన్ అన్నారు. శుక్రవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌వీఎం సహకారంతో ఏసీరెడ్డి నగర్‌లో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం జోగు ప్రకాష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌తోపాటు ఆర్డీఓ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు అహల్య, విజేందర్, దేవదానం, లలిత, వరలక్ష్మి, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి విద్యార్థిని ఐశ్వర్య ఎంపిక



జనగామ రూరల్: ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ కాంపిటీషన్‌లో ధర్మకంచ జెడ్పీఎస్ఎస్(బాలుర)కు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఐశ్వర్య ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల 13న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని హెచ్‌ఎం స్వర్ణం ప్రకాశం తెలిపారు.



అసెంబ్లీలో ఎమ్మెల్యేలు

హైదరాబాద్‌లో శాసనసభ సమావేశాలకు శుక్రవారం హాజరవుతున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, పక్కన వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

ఆట మొదలైంది..

చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

- 19 మంది సంతకాలతో అదనపు కలెక్టర్‌కు లేఖ
- బీఆర్‌ఎస్‌తో కలిసివచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లు
- మున్సిపల్ చైర్‌పర్సన్ వైపు ఉన్నది ఏడుగురు సభ్యులు



అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం ప్రతులను అందజేస్తున్న అసమ్మతి కౌన్సిలర్లు

జనగామ: మున్సిపల్ క్యాంపు రాజకీయాలకు ఎట్టకేలకు తెర పడింది. చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్‌పై అవిశ్వాసం, అలాగే ఫ్లోర్‌లీడర్ మారబోయిన పాండును తొలగించాలని 11 మంది బీఆర్ఎస్, 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి తీర్మానం కాపీలను అందజేశారు. ఈ డిమాండ్‌పై అధికార పార్టీలోని అసమ్మతి సభ్యులు గత నెల 25న కూటమికట్టిన విషయం తెలిసిందే. హనుమకొండ హరిత హోటల్‌లో క్యాంపు పెట్టిన సభ్యులు.. ఈనెల 2న జనగామకు చేరుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ సభ్యులతో మంతనాలు జరిపి అవిశ్వాసానికి మద్దతివ్వాలని కోరారు. అవిశ్వాసమా.. రాజీనామానా.. రెండింటి నడుమ ఊగిసలాడిన అధికార పార్టీ కౌన్సిలర్లు.. చివరికు ప్రతిపక్ష పార్టీకి చెందిన కౌన్సిలర్లతో కలిసి ఫ్లోర్‌లీడర్‌తో పాటు ఇద్దరిని గద్దె దింపడమే లక్ష్యంగా ముందుకు వెళ్లారు.

జత కట్టిన 8 మంది కాంగ్రెస్ సభ్యులు..

అధికార పార్టీ కౌన్సిలర్లు నిర్ణయించిన అవిశ్వాసానికి కాంగ్రెస్ సభ్యులు గంగరబోయిన మల్లేశం(ఫ్లోర్ లీడర్, 24వ వార్డు), గాదెపాక రాంచందర్ (డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, 16వ వార్డు), ముస్త్యాల రాంచందర్ (9వ వార్డు), రామగల్ల అరుణ(1వ వార్డు), వంగాల కళ్యాణి(6వ వార్డు/ఆమెకు బదులుగా భర్త మల్లారెడ్డి వచ్చారు), బాల్డె కమలమ్మ(22వ వార్డు), మంత్రి సుమలతశ్రీశైలం(4వ వార్డు), జక్కుల అనితవేణుమాధవ్(17వ వార్డు) సంపూర్ణ మద్దతు ఇచ్చారు. కాగా బీజేపీకి చెందిన పలువురు సభ్యులతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం.

చైర్‌పర్సన్ వైపు ఎవరంటే..

ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ జమునలింగయ్య వైపు.. ఆమెతో పాటు తాళ్ల సురేష్‌రెడ్డి, మేకల రాంప్రసాద్, మారబోయిన పాండు, ఎండీ.సమ్మద్, గుర్రం భూలక్ష్మినాగరాజు, పగిడిపాటి సుధసుగుణకార్‌రాజు ఉన్నారు. ఇందులో ఒకరిద్దరు కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకునేలా అసమ్మతి పక్షం సభ్యులు పావులు కదుపుతున్నారు.

పదవుల రేసులో..

మున్సిపల్ చైర్‌పర్సన్ రేసులో బండ పద్మ పోటీ పడుతుండగా.. వైస్‌చైర్మన్ కోసం కర్రె శ్రీనివాస్.. ఫ్లోర్‌లీడర్ పదవి దక్కించుకునేలా ముస్త్యాల దయాకర్ సహచర సభ్యుల ఆశీస్సులు కోరుతున్నారు. కాంగ్రెస్ సైతం బరిలో ఉన్నామంటూ సంకేతాలు ఇస్తుండగా.. చివరకు తమకే మద్దతు ఇస్తారని అధికార అసమ్మతి వర్గం గట్టిగా నమ్ముతోంది. అయితే మున్సిపాలిటీలో 30 మంది కౌన్సిలర్లు, ఒక ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ఉంటారు. ఇప్పటి వరకు క్యాంపు రాజకీయాల్లో మద్దతుగా నిలిచిన వారు చివరి వరకు ఉండి అవిశ్వాసాన్ని నెగ్గిస్తారా.. లేక జారిపోతారా వేచి చూడాలి.

రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పూజలు..



రేణుక ఎల్లమ్మ సన్నిధిలో పూజలు చేస్తూ..

అధికార పార్టీకి చెందిన బండ పద్మయాదగిరిరెడ్డి (19వ వార్డు), కర్రె శ్రీనివాస్(21వ వార్డు), జూకంటి లక్ష్మీశ్రీశైలం(20వ వార్డు), మల్లవరపు అరవింద్‌రెడ్డి(7వ వార్డు), నీల శ్రీజరాంమ్మోహన్ (10వ వార్డు), మల్లిగారి చంద్రకళరాజు(13వ వార్డు), ముస్త్యాల దయాకర్(29వ వార్డు), దేవరాయ నాగరాజు(5వ వార్డు), పాక రమ(11వ వార్డు), పేర్ని స్వరూప(14వ వార్డు), వాంకుడోతు అనిత(2వ వార్డు) శుక్రవారం యశ్వంతాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అవిశ్వాస పత్రాలను అమ్మవారి పాదాల చెంతన పెట్టి ఐక్యతతో ఉంటామని ప్రమాణం చేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

పార్టీకి చెడ్డపేరు రావొద్దనే.. : బండ పద్మ



సీఎం కేసీఆర్, కేటీఆర్, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి విధేయులుగా ఉంటూనే.. పార్టీకి చెడ్డపేరు రావొద్దనే ఉద్దేశంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం, ఫ్లోర్‌లీడర్ తొలగింపు కోరుతున్నట్లు బీఆర్ఎస్ సభ్యురాలు బండ పద్మయాదగిరిరెడ్డి అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ అధికార పక్షం–11, కాంగ్రెస్–8 మంది సభ్యులు మద్దతు ఇవ్వగా, బీజేపీ నుంచి సైతం ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. 2020 ఎన్నికల్లో ప్రస్తుత చైర్‌పర్సన్ జమునకు సహకరించామనీ.. అవినీతి, అక్రమాలతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందనే ఆందోళనతోనే అవిశ్వాసానికి వెళ్లినట్లు వివరించారు.

వార్డుల్లో అభివృద్ధి లేదు: జక్కుల అనిత



కౌన్సిలర్లుగా గెలుపొంది మూడేళ్లు గడిచిపోతున్నా.. తమ వార్డుల్లో రూ.5లక్షల అభివృద్ధి కూడా జరగలేదని కాంగ్రెస్ కౌన్సిలర్ జక్కుల అనితవేణుమాధవ్ అన్నారు. అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ సభ్యుల కోరిక మేరకు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నిర్ణయానికి మద్దతుగా ముందుకొచ్చామని చెప్పారు.



సారలమ్మ గద్దెలపై మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మనసారా మొక్కులు

మేడారానికి పోటెత్తిన భక్తులు

సమ్మక్క-సారలమ్మలను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం తరలివచ్చారు. ములుగు జిల్లా మేడారంలో జరుగుతున్న మినీ జాతరకు తెలంగాణలోని పలు ప్రాంతాలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి జనం వచ్చి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గద్దెల ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వనదేవతలను పలువురు అధికారులు దర్శించుకున్నారు. - ఎస్ఎస్ తాద్వాయి

- 8లో

టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



డీఈఓ కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన

జనగామ: బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం ప్రారంభమైంది. జిల్లాలో 1,031 మంది టీచర్లు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలను సంబంధిత హెచ్‌ఎంలకు అందించారు. ఎంఈఓల నుంచి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి చేరగా.. డీఈఓ రాము నేతృత్వంలో అధికారులు తప్పొప్పుల పరిశీలన మొదలు పెట్టారు. ఈనెల 6వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగించి, అదే రోజు ఆన్‌లైన్‌లో అప్రూవల్ చేస్తారు. 7, 8 తేదీల్లో బదిలీ, పదోన్నతులకు వెబ్‌సైట్‌లో అర్హత పాయింట్లతో తాత్కాలిక సీనియార్టీ జాబితా ప్రదర్శిస్తారు. 8 నుంచి 10వ తేదీ వరకు ఆధారాలతో కూడిన అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. 11 నుంచి 12 వరకు బదిలీలు, పదోన్నతుల తుది సీనియార్టీ జాబితా ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు. అలాగే జీహెచ్‌ఎంలు బదిలీ కోసం వెబ్ ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. 13న జీహెచ్‌ఎం ఆప్షన్లలో లోపాలుంటే సరిదిద్దుకునే అవకాశం, 14న ఆన్‌లైన్ ద్వారా బదిలీలు, 15న ఖాళీ స్థానాల వెల్లడి, 16 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంగా పదోన్నతులు, 19 నుంచి 20 వరకు ఖాళీ అయిన ఎస్‌ఏల వివరాల వెల్లడి, వెబ్ ఆప్షన్, 21న ఎస్‌ఏల నియామకానికి లోపాల సవరణ, 22 నుంచి 23 వరకు ఎస్‌ఏలతో పాటు వారికి సమానప్రాతిపదికన ఉన్న కేడర్‌ల బదిలీ ప్రక్రియ చేపడతారు. 24న ఎస్‌ఏ ఖాళీల ప్రదర్శన, 25 నుంచి 27 వరకు ఎస్జీల ప్రమోషన్ల ప్రారంభం, 28 నుంచి మార్చి 2 వరకు ఎస్జీల ఖాళీల ప్రదర్శన, ఎస్జీలకు వెబ్ ఆప్షన్, 3న ఎస్జీల బదిలీ ప్రక్రియ లోపాల సవరణ, 4న బదిలీలు చేపడతారు.

కళాతపస్వికి నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న జనగామ కవులు, కళాకారులు

జనగామ రూరల్: కళాతపస్వి కె.విశ్వనాథ్ మృతి చెందగా.. ఆయన ఆత్మకు శాంతికలగాలని శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో 'జరసం' ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జరసం అధ్యక్షుడు సోమనర్సింహాచారి, జి.కృష్ణ, సోమేశ్వరాచారి, భాస్కర్, రామచంద్రం, సాయికిరణ్, మహేందర్, శివనాథ్, లావణ్య, వసంత, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జనగామ రూరల్: మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం 'జాయింట్ యాక్షన్ ప్లాన్' ఇంప్లిమెంటేషన్‌పై పోలీస్, విద్యాశాఖ, ఎక్సైజ్, సోషల్ వెల్ఫేర్, బాలల పరిరక్షణ విభాగం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్లలోపు పిల్లలకు ప్రమాదకరమైన మందులు విక్రయించొద్దని, ఈ మేరకు డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ వారు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియో గం, గంజాయితో కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు మందుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల బారినపడిన వారిని ఎన్జీఓ సహకారంతో మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. మద్యం షాపులు నిబంధనల ప్రకారం పాఠశాలలు, కళాశాలలకు దూరంగా ఉండేలా ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి జయంతి, బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, చైర్మన్ ఉప్పలయ్య, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎక్సైజ్ అధికారి విష్ణుప్రియ, సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–4 అభ్యర్థులకు స్టడీ మెటీరియల్



అభ్యర్థులకు మెటీరియల్ ఇస్తున్న రవీందర్

జనగామ: నిరుద్యోగ యువతీ యువకులు గ్రూప్–4 ఎంట్రెన్స్ పరీక్షలకు సిద్ధం కావడానికి తెలంగాణ ప్రభుత్వం జిల్లాలో 90 రోజులు ఉచిత శిక్షణ ఇచ్చింది. వారికి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి రవీందర్ చేతుల మీదుగా ప్రిపరేషన్ బుక్స్(మెటీరియల్) శుక్రవారం అందజేశారు. ఏబీవీ డిగ్రీ కళాశాలలో నిపుణుల ఆధ్వర్యంలో ఇచ్చిన శిక్షణకు జిల్లా వ్యాప్తంగా 120 మంది అభ్యర్థులు పేర్లను నమోదు చేసుకోగా.. 66 మంది రెగ్యులర్‌గా హాజరయ్యారు. ఎంట్రెన్స్ వరకు ఇంటి వద్ద ప్రిపేర్ కావడానికి రూ.5వేల విలువ చేసే మెటీరియల్ ఇచ్చారు.

ఎంట్రెన్స్ వరకు శిక్షణ ఇవ్వాలి



గ్రూప్–4 ఎంట్రెన్స్ పరీక్షకు మరో నాలుగు నెలల సమయం ఉంది. 90 రోజుల ఉచిత శిక్షణ ఇచ్చారు. ఇంటి వద్ద ప్రిపేర్ కావడానికి మెటీరియల్ కూడా ఇస్తున్నారు. ప్రైవేటులో శిక్షణ తీసుకోవాలంటే సుమారు రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. ఎంట్రెన్స్ వరకు ప్రభుత్వమే ఉచిత శిక్షణ ఇవ్వాలి.

- ఆరెళ్ల భాస్కర్, వడ్లకొండ, జనగామ

సంపూర్ణ అవగాహన కల్పించారు



ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా ఇచ్చిన శిక్షణ ఉపయోగకరంగా ఉంది. ఎంట్రెన్స్ కోసం ఎలా ప్రిపేర్ అవ్వాలి.. పరీక్ష సమయంలో టెన్షన్ లేకుండా రాయాలనే దానిపై మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు. అలాగే సబ్జెక్టుల వారీగా సంపూర్ణ అవగాహన కల్పించారు.

- చౌదర్‌పల్లి ఉమాకర్, మాణిక్యాపురం, లింగాలఘణపురం

ఆర్‌టీఐ సెల్ చైర్మన్ల నియామకం



ఐడీ కార్డు, నియామక పత్రం ఇస్తున్న ప్రతినిధులు

జనగామ రూరల్: జాతీయ సోషియల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ ఆదేశాల మేరకు ఆర్‌టీఐ సెల్ నియోజకవర్గాల చైర్మన్లను నియమించారు. జనగామకు బాల్నె ఉమాపతి, పాలకుర్తికి సునావత్ భీమాను నియమిస్తూ శుక్రవారం జిల్లా చైర్మన్ బి.అరుణ్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ ఎడ్ల శ్రీనివాస్ పత్రం, ఐడీ కార్డు అందజేశారు. జిల్లా వైస్ చైర్మన్ తిరుపతి, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'భోజన' ఏజెన్సీలకు ఊరట

- ధరలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- నాలుగు నెలలుగా అందని 'గుడ్డు' బిల్లు
- సిలిండర్, మిక్సీ, గ్రైండర్ ఉచితంగా ఇవ్వాలి
- గౌరవ వేతనం సకాలంలో చెల్లించాలి
- 'భోజన' నిర్వాహకుల వేడుకోలు



ఓబుల్‌కేశ్వాపూర్ పాఠశాలలో వంట చేస్తున్న నిర్వాహకులు

సర్కారు స్కూళ్లు	:	508
ప్రాథమిక	:	341
ప్రాథమికోన్నత	:	64
ఉన్నత	:	104
విద్యార్థులు	:	35,965
వంట కార్మికులు	:	950

జనగామ రూరల్: పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు తోడు సకాలంలో బిల్లులు అందక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టే కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ ఖర్చు పెరిగిపోవడంతో చాలా వరకు ఏజెన్సీలు మానేశాయి. ఈ నేపథ్యంలో సరుకులకు ప్రభుత్వం చెల్లించే ధరలు పెంచుతూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులతో కాస్త ఊరట లభించింది.

ఏళ్ల తరబడి అవస్థలు..

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెట్టే కార్మికులు అరకొర ధరలు, సదుపాయాల లేమితో కొన్ని ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు ఏదో ఒక కాయకూర, పప్పు, చారు తప్పనిసరి వండిపెట్టాలి. అయితే ప్రస్తుతం కూరగాయలు, పప్పు, చింతపండు, కారం, ఇతర సామగ్రితో పాటు, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వం చెల్లించే డబ్బులు ఎటూ సరిపోవడం లేదు. వారానికి మూడు సార్లు కోడిగుడ్డు విద్యార్థులకు అందించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర విపరీతంగా పెరిగింది. నాలుగు నెలల నుంచి గుడ్డుకు సంబంధించిన బిల్లు రావడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

మధ్యాహ్న భోజనం పథకంలో 1 నుంచి 5వ తరగతి ఒక విద్యార్థికి గతంలో రూ.4.97 పైసలు ఉండగా రూ.5.46 పైసలకు పెరిగింది. 6, 7, 8 ఆపై తరగతులకు(గుడ్డు ధర మినహాయించి) రూ.7.45 పైసల నుంచి రూ.8.17 పైసలకు, 9, 10 తరగతుల వారికి గుడ్డుతో కలిపి గతంలో రూ.9.95 పైసలు చెల్లిస్తుండగా ప్రస్తుతం రూ.10.67 పైసలకు పెరిగింది. ఈ ధరలు 2022 అక్టోబర్ 1వ తేదీ నుంచి వర్తించనున్నాయి.

రాగిజావతో చిక్కులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో సత్యసాయి, అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేస్తున్నారు. ఇందుకుగాను జావ పిండి, బెల్లంపొడి ప్యాకెట్లు ఆయా పాఠశాలలకు అందజేస్తుండగా.. రాగిజావ కాయడానికి ఎక్కువ విద్యార్థులు ఉన్న చోట ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాగి జావ తయారీ అదనం కావడంతో గ్యాస్ సిలిండర్ మూడు నుంచి ఐదు రోజులు కూడా రావడం లేదని వంట ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. గ్యాస్ ధర పెరిగిన కారణంగా కొన్ని స్కూళ్లలో గత్యంతరం లేక కట్టెల పొయ్యి వాడుతున్నారు.

అప్పు తెచ్చి వంట చేస్తున్నం..



పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నాం. ప్రభుత్వం చెల్లించే ధరలు ఏమాత్రం సరిపోవడం లేదు. అన్ని సరుకుల రేట్లు పెరిగిపోవడంతో పెట్టుబడి ఎక్కువై కూలి గిట్టుబాటు కావడం లేదు. సకాలంలో బిల్లులు రాక అప్పులు తెచ్చి వంట చేస్తున్నం. బిల్లులు వెంటనే చెల్లించడంతోపాటు గ్యాస్ లిండర్, మిక్సీ, గ్రైండర్ ఉచితంగా అందించాలి.

- ఎం.మంగ, ఓబుల్‌కేశ్వాపూర్, నిర్వాహకురాలు

పెంచిన గౌరవ వేతనం ఇవ్వాలి

ఓ వైపు అన్ని సరుకుల ధరలు పెరిగిపోయాయి. బిల్లులు సకాలంలో రాకున్నా పిల్లల బాధ చూడలేక అప్పు చేసి వండి పెడుతున్నం. చేసిన పనికి గతంలో రూ.వెయ్యి ఇచ్చేది. రూ.మూడు వెయ్యిలకు పెంచినా సకాలంలో అందడంలేదు. ఇబ్బందులు తప్పడంలేదు.

-ఎండీ.ఖలీదాబేగం, తాటికొండ, నిర్వాహకురాలు

ప్రభుత్వం నుంచి రాగానే చెల్లిస్తాం..



మధ్యాహ్న భోజనం వండిపెట్టే నిర్వాహకులకు సంబంధించి బిల్లుల చెల్లింపు ప్రక్రియను ఎప్పటికప్పుడు వేగవంతం చేస్తున్నాం. ఏజెన్సీల నియామకం, నిర్వహణ బాధ్యత ఆయా మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు పర్యవేక్షిస్తున్నారు. పెండింగ్ బిల్లులు ఉంటే ప్రభుత్వం నుంచి రాగానే చెల్లిస్తాం.

- కె.రాము, జిల్లా విద్యాశాఖాధికారి

నిడిగొండ హైస్కూల్ విద్యార్థుల ఆందోళన

ఈ హెచ్‌ఎం మాకొద్దు..



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రఘునాథపల్లి: 'ఈ హెచ్‌ఎం మాకొద్దు.. బదిలీ చేయండి' అంటూ విద్యార్థులు ఆందోళనకు దిగిన సంఘటన మండల పరిధి నిడిగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీతో హెచ్‌ఎం మంజుల అనుచితంగా వ్యవహరిస్తోందంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంసీ కమిటీ, గ్రామ పెద్దలు మూడురోజుల క్రితం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాలతో నోడల్ అధికారి రఘునందన్‌రెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి శుక్రవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. హెచ్‌ఎం అడ్మినిస్ట్రేషన్ వైఫల్యమే అని తేలింది. 9 మంది టీచర్ల సర్వీసు బుక్కులు హెచ్‌ఎం ఆధీనంలో ఉండగా అవి వారికి ఇవ్వాలని విచారణ అధికారులు సూచించగా.. ఉమామహేశ్వరి అనే ఉపాధ్యాయురాలి సర్వీస్ బుక్కు లేదంటూ హెచ్‌ఎం చెప్పడంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఈ క్రమంలో విద్యార్థులంతా 'ఈ హెచ్‌ఎం మాకొద్దు.. బదిలీ చేయండి' అంటూ పాఠశాల గేట్ మూసి ఆందోళనకు దిగారు. సాయంత్రం వరకు నిరసన చేపట్టారు. హెచ్‌ఎంపై వెంటనే చర్య తీసుకోవాలని టీచర్లు, సర్పంచ్ బిర్రు లక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ మేడ స్వామి విచారణాధికారులకు వినతి పత్రం అందజేశారు.

క్లుప్తంగా

వీనస్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన


ఆభరణాలు కొనేందుకు వచ్చిన మహిళలు

హన్మకొండ చౌరస్తా: నగరంలోని బస్టాండ్ రోడ్డులో గల వీనస్ జ్యువెల్లరీ షోరూంలో శుక్రవారం ప్రారంభమైన జ్యువెల్లర్స్, డైమండ్స్ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు జ్యువెల్లరీ చైర్మన్ రవిచంద్ర తెలిపారు. ఇక్కడ లభించే డైమండ్, బంగారు ఆభరణాల డిజైన్స్, వెరైటీలను ధరించి కస్టమర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నార న్నారు. కస్టమర్లకు నచ్చేలా అన్ని రకాల వెరైటీలు డిస్కౌంట్ ధరలకే అందిస్తున్నట్లు రవిచంద్ర తెలిపారు. శని, ఆదివారం కూడా ప్రజలకు ఈ ఎగ్జిబిషన్, సేల్ అందుబాటులో ఉంటుందని, ఆసక్తి గల కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ల అంతర్గత బదిలీలు

- సెక్షన్ల మార్పు సైతం..

కేయూ క్యాంపస్: కేయూలో ముగ్గురు అసిస్టెంట్ రిజిస్ట్రార్లను అంతర్గతంగా బదిలీలు చేస్తూ, సెక్షన్‌లు మార్పు చేస్తూ కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూలో ఆడిట్ విభాగంలో ఆడిట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీలతను అకౌంట్స్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న కిష్టయ్యను కేయూలోని ఆడిట్ విభాగానికి ఆడిట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. అంతేకాకుండా ఆయనకు పబ్లికేషన్ సెల్ ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలను కూడా అప్పగించారు. కేయూ పబ్లికేషన్ సెల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ నర్సింహారావును ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలకు బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

జాతకం చెబుతున్న కోయదొరలు


కుర్రో.. కుర్రు..

ఎస్‌ఎస్ తాడ్వాయి: కుర్రో కుర్రు. ఉన్నది ఉన్నట్లు చెబుతా.. జరిగింది చెబుతా.. జరిగేది చెబుతా.. అంటూ మేడారంలో శుక్రవారం కొందరు కోయ దొరలు భక్తులకు జోష్యం చెప్పారు. మినీజాతర సందర్భంగా కోయ దొరలు ప్రత్యేక వేషధారణలో వనమూలికలతో కనిపించారు. భక్తులు వారి వద్దకు వెళ్లి జాతకం చెప్పించుకున్నారు.

నీటిని బాటిళ్లలో నింపుతున్న భక్తులు


జలధార..

సమ్మక్క కొలువైన చిలుకలగుట్ట నుంచి జలధార వస్తుంది. మేడారం వచ్చిన భక్తులు ఈ నీటిని పవిత్ర జలంగా భావించి నెత్తిన చల్లుకుంటున్నారు. ఇళ్లకు తీసుకెళ్తున్నారు. చిలుకలగుట్టపై ఉన్న వన మూలికలను తాకుతూ వచ్చే జలధార నీటిని తాగితే ఆరోగ్యానికి మంచిదనేది భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు ఆనీటి కోసం క్యూ కడుతున్నారు.

తీరొక్క మొక్కులు..



మేడారానికి వచ్చిన భక్తులు చెట్ల కింద సేద తీరుతున్నారు. భక్తులు విడిది చేసిన చోటే అమ్మ వారి ప్రతిరూపాలను పసుపు, కుంకుమలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కుటుంబ సమేతంగా పూజలు చేసి ఆతర్వాత అమ్మవార్ల గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. మరికొంత మంది భక్తులు నూతన వస్త్రాలు ధరించి అమ్మవారి ఒడి బియ్యాన్ని తయారు చేశారు. శుక్రవారం బస చేసిన చోటో పూజలు నిర్వహించి గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

పోటెత్తిన భక్తజనం


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు అప్పజెప్పున్న భక్తులు

- కిటకిటలాడిన అమ్మవార్ల గద్దెల ప్రాంగణం
- దారి పొడవునా వాహనాల బారులు

ఎస్‌ఎస్ తాడ్వాయి: సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు శుక్రవారం మేడారానికి పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు మేడారానికి తరలివచ్చారు. భక్తులు జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద అమ్మవార్లకు పూజలు నిర్వహించి మనసారా మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో గద్దెల ప్రాంగణం కళకళలాడింది. కోరిన కొర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు ముడుపులుకట్టారు. గంట మోతతో గద్దెల ప్రాంగణం మార్మోగింది. వివిధ ప్రాంతాల భక్తుల రాకతో మేడారం కిక్కిరిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.


శివసత్తుల నృత్యాలతో అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులు

మొక్కుల అనంతరం భక్తులు మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు.

పకడ్బందీ ఏర్పాట్లు

భక్తుల రద్దీ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. దొంగతనాలు జరగకుండా సీసీఎస్ టీంలు పటిష్టమైన చర్యలు చేపట్టారు. రాష్ట్ర ఎన్నికల


సమ్మక్క గద్దె వద్ద భక్తురాలి పూనకం

కమిషన్ సెక్రటరీ అశోక్‌కుమార్, మాజీ సీనియర్ ఐఏఎస్ ఎంజీ గోపాల్, రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, డీఆర్‌ఓ రమాదేవి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ రాజేంద్రం దగ్గరుండి వీఐపీలకు ఆలయ సంప్రదాయంగా స్వాగతం పలికి వారిని సన్మానించి పూజారుల చేతుల మీదుగా ప్రసాదం అందించారు. జంపన్నవాగు నుంచి మేడారం దారి పొడవునా వాహనాలు బారులుదీరాయి. పోలీసులు వాహనాల్ని పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు గద్దెల వరకు రావడంతో ఆర్టీసీ బస్సులో వచ్చిన భక్తులు నేరుగా అమ్మవార్ల గద్దెలకు చేరుకున్నారు. భక్తులు, వీఐపీల రాకతో మేడారం సందడిగా మారింది.

విజేతగా నిలిచిన వాగ్దేవి కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్


సాక్షి ట్రోఫీ.. 'వాగ్దేవి' కైవసం


సీనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన నిట్ క్రీడాకారులకు కప్ అందజేస్తూ..


జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఎల్‌బీ కళాశాల జట్టు

- రన్నరప్‌గా నిలిచిన నిట్ జట్టు
- జూనియర్స్ విజయకేతనం ఎగురవేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
- రన్నరప్‌గా లాల్‌బహదూర్ కళాశాల


జూనియర్ విభాగంలో విన్నర్‌గా నిలిచిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు

రామన్నపేట: వారం రోజులుగా 24 జట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు అద్యాంతం ఉత్సాహంగా కొనసాగాయి. యూనివర్సిటీ స్థాయి పోటీలను తలదన్నేలా క్రీడాకారులు రెట్టింపు ఉత్సాహంతో ఇందులో పాల్గొనడంతో సాక్షి క్రికెట్ పోటీలకు అత్యంత ఆదరణ లభించింది. తమ కళాశాల జట్లు విజయం సాధించాలనే తపనలో కళాశాలల యాజమాన్యాలు సైతం క్రీడాకారులను ఉత్తేజపర్చేందుకు ఎల్బీ కళాశాల మైదానానికి చేరుకుని ఆయా సంస్థల యాజమాన్యాలు సైతం మరింత ఉత్సాహాన్ని నింపాయి. శుక్రవారం సీనియర్ విభాగంలో ఫైనల్ మ్యాచ్‌ను ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు టాస్ వేసి, బ్యాటింగ్ చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఫైనల్ మ్యాచ్ నువ్వా..నేనా అనే రీతిలో జరిగింది. నిట్ జట్టుపై వాగ్దేవి జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెల్చుకున్న నిట్ జట్టు బౌలింగ్ ఎంచుకోగా మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి జట్టు 89 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన నిట్ జట్టు 10 ఓవర్లలో 79 పరుగులు మాత్రమే సాధించగలిగింది. వాగ్దేవి జట్టులో క్రీడాకారుడు సిద్ధార్థ 27 బంతుల్లో 48 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు.

జూనియర్స్ విభాగంలో..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల జూనియర్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విజయకేతనం ఎగురవేసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఎల్బీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల జట్లు తలపడగా టాస్ గెలుచుకున్న పాలిటెక్నిక్ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 111 పరుగులు సాధించింది. అనంతరం ఎల్బీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 93 పరుగులు మాత్రమే సాధించగలిగింది. పాలిటెక్నిక్ కళాశాలలో సాయి వంశీ 20 బంతుల్లో 54 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

బహుమతుల ప్రదానం

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు 'కుడా' చైర్మన్ సుందర్ రాజు యాదవ్, సాక్షి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఈవెంట్ మేనేజర్ సుమన్, వరంగల్ స్టాఫ్ రిపోర్టర్ వాంకె శ్రీనివాస్, టీవీ కరస్పాండెంట్ విజేందర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా 'కుడా' చైర్మన్ సుందర్‌రాజు మాట్లాడుతూ.. సాక్షి మీడియా ఆధ్వర్యంలో క్రికెట్ పోటీల నిర్వహణతో యువ క్రీడాకారుల్లో మంచి ఉత్తేజాన్ని నింపారని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్బీ కళాశాల లెఫ్టినెంట్ అధికారి ఎం.సదానందం, కళాశాల పీడీ ప్రభాకర్, వాగ్దేవి కళాశాల యజమాన్య ప్రతినిధి హరేందర్, నిట్ ఫిజికల్ డిపార్టుమెంట్ ప్రతినిధి, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ

ఎగిసిపడిన అగ్ని కీలలు

- ఓల్డ్ ఫర్నిచర్ షాపులో అగ్ని ప్రమాదం
- ఐదుషాపులకు వ్యాపించిన మంటలు
- 1.37 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారుల ప్రాథమిక అంచనా


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది


ఓల్డ్ ఫర్నిచర్ షాపుల్లో ఎగిసిపడుతున్న మంటలు

ఖిలా వరంగల్: వరంగల్ అండర్ బ్రిడ్జి ఇసుక అడ్డా జంక్షన్ సమీపం పెరకవాడలోని ఓల్డ్ ఫర్నిచర్ షాపులో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటలకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో భారీ ప్రమాదం జరిగింది. టేకు కర్ర చెక్కపొడికి షార్ట్ సర్క్యూట్‌తో నిప్పురవ్వలు అంటుకుని అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న ఐదు ఓల్డ్ ఫర్నిచర్ షాపులు, ఒక బైక్ మెకానిక్ షాపు, పాత సామాన్ల షాపు, ఒక ఇల్లు, ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్, సీడ్స్ గోదాంలోకి మంటలు వ్యాపించి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. రూ. రూ.2 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్, పోలీస్, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. రూ. 5 కోట్లకు పైగా ఆస్తిని కాపాడినట్లు అధికారులు అంచనాకు వచ్చారు.

అధికారుల అప్రమత్తం

ప్రమాదం జరిగిన సమయంలో పనికోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు గాఢ నిద్రలో ఉన్నారు. మంటలు ఎగిసిపడి పొగ కమ్ముకుపోయింది. దీంతో కార్మికులు, స్థానికులు రోడ్లపైకి పరుగులు తీశారు. స్థానికులు మిల్స్‌కాలనీ పోలీసులు, వరంగల్ ఫైర్ అధికారులు అలర్ట్ అయ్యారు. ఆరు ఫైరింజన్లతోపాటు 40 మంది సిబ్బంది మంటలు ఆర్పారు. ఉదయం 4:30 నుంచి దాదాపు 12 గంటలు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ ఆస్తి నష్టం భారీగా జరిగింది. సర్వం కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని ఎండి అబ్దుల్లా, మాషా అల్లా ట్రేడర్స్, ఏటుజెడ్ ఫర్నిచర్స్, లక్ష్మి వినాయక పాత సమాన్ల షాపు, మహాలక్ష్మీ ఆటో మొబైల్ మెకానిక్ షాపు, మాధురి ఏజన్సీస్ ఫెస్టిసైడ్స్, సీడ్స్ హోల్ సెల్, రిటేల్ షాపు నిర్వాహకులు కోరుతున్నారు. కాగా.. ఘటనాస్థలిని అధికారులు పరిశీలించారు. రూ.5కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సుమారు రూ.1.37 కోట్లు ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు వరంగల్ అగ్నిమాపక శాఖ డివిజన్ ఫైర్ అధికారి మామిడి భగవాన్‌రెడ్డి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

బిల్డింగ్ అమ్మబడును

- వరంగల్, కరీమాబాద్, ఉర్సు దగ్గరలో మేయిన్‌రోడ్‌కు తూర్పు ఫేస్ గల 200 గజాల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర: 9347219693, 9849459661 [W-775814]

SERVICES

- బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 90320 40019. [T-1746]

పాత కారు ఆఫర్

- మీ పాతకారును హేమా హ్యుందాయ్ వరంగల్‌కి మార్చుకొండి, అద్భుతమైన ఆఫర్‌లను పొందండి, మాకు కాల్ చేయండి. సెల్: 9701733611, T&C apply. [WA-12462]

LOANS

- హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని వారంలో అమౌంట్ ఇప్పించబడును. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వారికి ఆర్థిక సహాయం చేయబడును సెల్: 7569519258 హన్మకొండ. [WA-6471]

WANTED

- Ice Cream, Milk Shakes, Snacks, Tea Masters కావలెను / మంచి కండీషన్లో ఉన్న వస్తువులు కావలెను. సంప్ర॥ 9866072260. [WA-6474]
- Accounting and project Asst. Req: Any Degree M/F 25 to 35 yrs, Exp. Accounts, GST Tally, English experts can apply: amruthadharanaturals@gmail.com Cell: 7981016232, HNK. [WA-6468]
- వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల చికెన్ కట్టర్ కావలెను. జీతం 18000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర॥ 6281342090, 9949857816. [WA-6469]
- కాంట్రాక్టర్ వద్ద పెట్రోల్ పంప్ కన్‌స్ట్రక్షన్‌లో పనిచేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్, సూపర్‌వైజర్స్ & సివిల్ ఇంజనీర్లు కావలెను. సంప్ర॥ సెల్: 9989606333, 9000243232. [W-775813]
- ప్రముఖ కార్పొరేట్ finance సంస్థలో పనిచేయడానికి అనుభవం కలిగిన టీం లీడర్స్ & కలెక్షన్ బాయ్స్ కావలెను. జీతం: 15000 to 20000/- వేల వరకు ఇంటర్వ్యూ 6th Febన జరుగును. సంప్ర॥ 8897853065. [WA-2927]
- Wine Shop లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. హసన్‌పర్తి మరియు కమలాపూర్. సంప్రదించండి. సెల్: 9182922080. [WA-12458]
- ప్రముఖ కుబోట ట్రాక్టర్ డీలర్‌షిప్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు ట్రాక్టర్ ఫీల్డ్‌లో కనీస అనుభవం కలిగిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటివ్స్. సెల్: 9398680229 [WA-12461]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779876]
- Need Marketing Executives / Managers to meet Schools for book Publishers Salary 15000 -30000/ PM Call:8919641609 [H-793268]
- శ్రీకృష్ణ హోమ్‌కేర్ (Govt. Reg.) Hyd లో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి/వంటపనికి స్త్రీలు/పు॥ కావలెను (ఏజెంట్లకు మంచి కమీషన్) జీ: 15,000- 25000/ - రూం+భో॥ ఫ్రీ. ఫోన్ : 9000448989. [H-793506]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9505507558, 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9505507558
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య


విజేందర్(ఫైల్)

నర్సంపేట రూరల్: అప్పుల బాధతో నర్సంపేటకు చెందిన తుమ్మ విజేందర్(32) శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విజేందర్ వస్‌గ్రామ్ గోల్డ్ షాపు నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నాళ్లుగా షాపు సరిగ్గా నడవపోవడంతో రూ.20 లక్షల వరకు అప్పు అయ్యింది. అది ఎలా తీర్చాలో తెలియక మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య విద్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

నల్లబెల్లి: మండలంలోని లెంకాలపల్లిలో పురుగుల మందు తాగి మతిస్థిమితం లేని ఓ వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. లెంకాలపల్లికి చెందిన గడ్డమీది సంపత్(40) గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఈక్రమంలో శుక్రవారం సంపత్ తన వ్యవసాయ భూమివద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం తెలిపారు.

ఒర్రెలో పడి కూలీ మృతి


అశోక్ మృతదేహం

ఏటూరునాగారం: సారలమ్మ ఒర్రెలో పడి మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన దబ్బగట్ల అశోక్(26) శుక్రవారం మృతి చెందాడు. వాజేడు మండలం పూసూరు గ్రామానికి చెందిన అశోక్ రెండు నెలల నుంచి తన అత్తగారి ఊరైన కొండాయిలో కూలీ చేసుకుంటూ భార్య పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. అశోక్ ఈనెల 2న గోవిందరాజుల జాతరకు వెళ్లి మద్యం సేవించి రాత్రి 7 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. గంగస్నానానికి వెళ్లొస్తానని ఊరు శివారులోని సారలమ్మ ఒర్రెకు చేరకున్నాడు. ఒర్రెలో పడి మృతి చెందాడు. మృతుడి తల్లి దబ్బగట్ల నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

- పోలీసులను ఆశ్రయించిన యువతి

వరంగల్ రూరల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకుని, ఆతర్వాత నువ్వెవరో నాకు తెలియదు అని దబాయించిన ఓవ్యక్తిపై వరంగల్ సుందరయ్య నగర్‌కు రమణబోయిన రవీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు శుక్రవారం రాచమల్ల వివేక్‌పై కేసు నమోదు చేసినట్లు వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఎస్సై రాజన్ బాబు తెలిపారు. రవీనకు తన ఇంటి సమీపంలో ఉండే రాచమల్ల వివేక్ రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈనేపథ్యంలో అతడు ఆమెను లోబర్చుకున్నాడు. తీరా పెళ్లి చేసుకోమని రవీనా, వివేక్‌పై ఒత్తిడి తేవడంతో వివేక్ అందుకు నిరాకరించాడు. ఈవిషయమై రవీనా తల్లి వివేక్‌ను నిలదీసింది. ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో బాధిత యువతి వివేక్‌పై ఫిర్యాదు చేసింది.

అనారోగ్యంతో విద్యార్థి మృతి


అంకిత(ఫైల్)

కేసముద్రం: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ మండల కేంద్రం శివారు బ్రహ్మంగారి తండాకు చెందిన బానోతు అంకిత (14) శుక్రవారం మృతి చెందింది. బానోతు వెంకన్న కుమార్తె అంకిత మండల కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల అంకితకు తలనొప్పి రావడంతో, హనుమకొండలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈనేపథ్యంలో మెదడులో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమించి ఆమె గురువారం రాత్రి మృతి చెందింది. శుక్రవారం బాధిత కుటుంబాన్ని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజారాణి పరామర్శించారు. సొసైటీ ద్వారా రూ.10 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. పాఠశాలలో అంకిత మృతిపై విద్యార్థులు మౌనం పాటించి నివాళులర్పించారు.

'ఎర్రబెల్లీ'.. అభివృద్ధి ఏది?

- అడుగడుగునా 'అరూరి' భూకబ్జాలు
- వైఎస్సార్ టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల


పర్వతగిరిలో మాట్లాడుతున్న షర్మిల

పర్వతగిరి: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సొంత మండలంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. పర్వతగిరి మండల కేంద్రంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో ఆమె మాట్లాడుతూ.. మంత్రి దయాకర్‌రావు సొంత గ్రామమైన పర్వతగిరిని ఏమైనా పట్టించుకున్నాడా అని ప్రశ్నించారు. వంద పడకల ఆస్పత్రి కట్టలేదు. డిగ్రీ, ఇంటర్ కాలేజీలు లేవు కానీ ఈయన పంచాయతీరాజ్ శాఖ మంత్రి అంట అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సర్కారు పంచాయతీలకు నిధులు ఇవ్వదని, కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా దక్కనివ్వదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేశ్ సివిల్ కాంట్రాక్టర్‌గా ఉండి ఏ-1 కాంట్రాక్టర్ ఎలా అయ్యాడంటూ ప్రశ్నించారు. ఎమ్మెల్యే అరూరి అడుగడుగునా.. భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, అరాచకాలు భరించలేకే వర్ధన్నపేటలో సొంత పార్టీ కౌన్సిలర్లు ఎదురు తిరుగుతున్నారన్నారు. వైఎస్ఆర్ హయాంలో వ్యవసాయం పండుగలా ఉండేదని, నేడు కేసీఆర్ పాలనలో దండగలా మారిందన్నారు. వైఎస్సార్‌టీపీని ఆశీర్వదిస్తే వైఎస్ ప్రవేశ పెట్టిన పథకాలను మళ్లీ అమలు చేస్తామని అన్నారు.

సాఫీగా సాగిన షర్మిల పాదయాత్ర..

నెక్కొండ: వైఎస్.షర్మిల ప్రజాప్రస్థానం యాత్ర నర్సంపేట నియోజక వర్గం పార్టీ కార్యకర్తలు, ప్రజల అండదండలతో పోలీసుల కట్టుదిట్టమైన చర్యల మధ్య శుక్రవారం సాఫీగా సాగింది. ఓపక్క ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. షర్మిల తలపెట్టిన పాదయాత్ర ఉత్కంఠకు తెరపడగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నెక్కొండలోని వరంగల్ రోడ్డు నుంచి చింత నెక్కొండ క్రాస్ రోడ్డు మీదుగా సాయిరెడ్డిపల్లి, అడ్డబాట (ఏబీ) తండా వరకు పాదయాత్ర సాగింది. తెలంగాణలో వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్‌పైనే తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. పాదయాత్రలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్టల రాంరెడ్డి, డాక్టర్ నగేశ్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాడెం శాంతికుమార్, జిల్లా నాయకుడు భూక్యా లాలునాయక్, నర్సంపేట, నెక్కొండ మండలాల అధ్యక్షులు నూనె నర్సయ్య, సురేందర్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోతు అశోక్‌నాయక్, అలువాల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

దంతాలపల్లి: ఆర్థిక, కుటుంబ కలహాలతో ఓ సర్పంచ్ ఆత్మహత్యకు యత్నించాడు. మహబుబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం సర్పంచ్ నెహ్రూనాయక్ గ్రామాభివృద్ధికి అప్పులు తీసుకొచ్చి మరీ అభివృద్ధి పనులు చేయించాడు. ఇందు కోసం అందినకాడికి అప్పులు చేశాడు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇవ్వక, అప్పు ఇచ్చిన వాళ్లు పదే పదే అడగడంతో నెహ్రూనాయక్ మనస్తాపం చెందాడు. దీనికి తోడు ఆర్థిక సమస్య కారణంగా కుటుంబంలో కలహాలు చోటుచేసున్నాయి. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన సర్పంచ్ తండ్రి సుక్య స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అధికార పార్టీ సర్పంచ్ అయినప్పటికీ పాలక వర్గంలో గొడవల వల్ల ఉప సర్పంచ్ భర్త కొంత మంది ఇతర పార్టీ నాయకులతో కలిసి తన భార్యను బిల్లులకు సంబంధించి చెక్కులపై సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సర్పంచ్ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనకు కారణమైన ఉప సర్పంచ్ డొనికెన స్వాతి ఆమె భర్త వెంకన్న, షేక్ పాషా, అడిదం నరేందర్‌పై నెహ్రూ కొడుకు గుగులోతు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు.